క్లుప్తంగా

కళాశాల ఆవరణలో మద్యం సీసాలు, పెంకులు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాల ఆవరణలో గ్రామానికి చెందిన కొందరు యువకులు రాత్రి వేళల్లో మద్యం తాగి.. సీసాలను మైదానంలో వేస్తున్నారు. దీంతో పాటు సీసాలను పగలగొట్టడంతో మైదానంలో గాజు పెంకులు, ఖాళీ సీసాలు పడి ఉన్నాయని కళాశాల అధ్యాపకులు కురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం కళాశాలకు వచ్చిన విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. గుడికి ఎంత ప్రాధాన్యం ఉందో.. బడికి కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా.. పాఠశాలలో మద్యం తాగిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులను కోరారు.

'సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్తాం'



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు గడప, గడపకు వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఆయా సమస్యలను మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కాంగ్రెస్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బాలరాజుయాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులు, ఆసరా పింఛన్లు రాని వారి గురించి వివరాలు తెలుసుకున్నామన్నారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తామని తెలిపారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



పాన్‌గల్: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో విరాళాలు సేకరించారు. సీపీఎం గ్రామ కమిటీ నాయకుడు జంబులయ్య మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ తమకు తోచిన సాయం అందించి వయనాడ్ వరద బాధితులకు అండగా నిలవాలని కోరారు.


పెబ్బేరు రూరల్: సీపీఎం వనపర్తి పట్టణ కార్యదర్శి కురుమయ్య ఆధ్వర్యంలో బుధవారం వయనాడు వరద బాధితుల సహాయార్థం వనపర్తి పట్టణ కేంద్రంలోని షాపుల యజమానులతో రూ.13,400 నగదు విరాళంగా సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల కేరళ రాష్ట్రంలోని వయనాడులో కొండ చర్యలు విరిగిపడి వందల మంది సమాధి అయ్యారని వాపోయారు. కార్యక్రమంలో గంధం మదన్, ఉమ, సాయిలీల, రాబర్ట్, మద్దిలేటి, గొర్ల భాస్కర్, బాలస్వామి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంలో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, వాటిని గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల ప్రాముఖ్యత, పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, వైద్య వసతులు, మూఢనమ్మకాలు అనే అంశంపై మహిళలు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, సువర్ణ, ఎల్లమ్మ, కమల, మహేశ్వరి పాల్గొన్నారు.

తల్లిపాలే పుట్టిన బిడ్డకు అమృతం

కొత్తకోట రూరల్: తల్లిపాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, తల్లిపాలే పుట్టిన బిడ్డకు అమృతం అని డాక్టర్ నిహారిక అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కనిమెట్టలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ నిహారిక ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలింతలు పిల్లలకు పాలు ఇవ్వడంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. బిడ్డకు మొదటి టీకా తల్లిపాలేనని, తాగితే బిడ్డకు, తాగిస్తే తల్లికి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తిరుమలేశ్వరి, దీపిక, సువర్ణ, ఆశావర్కర్లు భాగ్యమ్మ, ఇందిర, ఏఎన్‌ఎం విజయ, గర్భిణులు, బాలింతలు తదితరులు ఉన్నారు.



మొక్కలు విరివిగా నాటాలి

గోపాల్‌పేట: గ్రామాల్లో, రోడ్లకు ఇరువైపులా విరివిగా మొక్కలు నాటి పెంచాల్సిన అవసరం ఉందని, అలాగే దోమల నివారణకు అధికారులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. బుధవారం ఆయన ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా గోపాల్‌పేట మండల కేంద్రంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్ సమీపంలోని కూడలిలో మొక్క నాటారు. అనంతరం రేవల్లి మండలంలోని చెన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. రూ.11.5 లక్షలతో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాలలో తాగునీటికి ప్లాస్టిక్ నల్లాలు బిగించడం, అప్పటికే కొన్ని పాడైపోవడాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే స్టీల్ నల్లాలు బిగించాలని ఆదేశించారు. పాఠశాలలో ప్రతి తరగతి గదిలో రెండు ఫ్యాన్లు, నాలుగు ట్యూబులైట్లు బిగించాలన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థికి ఒక లెక్క ఇచ్చి చేయాలని కోరగా.. ఆ విద్యార్థి లెక్కను చేయకపోవడంతో కలెక్టర్ ఎంఈఓ శ్రీనివాసులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై సరైన పర్యవేక్షణ లేకుండా ఉంటే కఠిచర్యలు తప్పవని హెచ్చరించారు.

కస్తూర్బాలో సమస్యలు పరిష్కరించండి

రేవల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించిన ఆయన వీలైనంత తొందరగా కస్తూర్బా పాఠశాలకు వెళ్లే దారికి సీసీరోడ్డు, భవనం వద్ద గ్రౌండ్ లెవెలింగ్, స్ట్రీట్ లైట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసులును ఆదేశించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా గణితం బోధించారు. అనంతరం రేవల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. రిజిస్టర్లు, గదులు, పనికిరాని చెత్త ఇతర వస్తువులు లేకుండా ఆస్పత్రిని శుభ్రంగా ఉంచాలని సెక్రెటరీని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు లక్ష్మీదేవి, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి



పాన్‌గల్‌లో..

చిన్నంబావి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ ఇక్బాల్ అన్నారు. ఆయన మండలంలోని కొప్పునూరులో వ్యవసాయాధికారులు, పంచాయతీ సిబ్బందితో కలిసి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్త ప్రాణుల మనుగడకు చెట్లే ఆధారమన్నారు. భవిష్యత్ తరాలకు ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ యుగంధర్, పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ కార్యాలయ ఆవరణలో శ్రమదానం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం కార్యాలయం సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చిమొక్కలు, చెత్తచెదారం తొలగించి ఆవరణను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఏపీఎం సక్రూనాయక్ అన్నారు. కార్యక్రమంలో సీసీ బాలశివుడు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

కొత్తకోటరూరల్/ఆత్మకూర్/అమరచింత: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 10వ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు పని చేయాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అన్నారు. బుధవారం కొత్తకోట మండలంలోని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, పెద్దమందడి మండలంలోని వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, ఆత్మకూర్‌లోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను, అమరచింతలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. గతేడాది పదో తరగతిలో 50 శాతానికి మించి ఫలితాలు రాలేదని, ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు అనుసరిస్తున్న ఉన్నతి కార్యక్రమంతో పాటు పదో తరగతి విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన లక్ష్య కార్యక్రమ నిర్వహణ కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కృష్ణయ్య, భాస్కర్‌సింగ్, జీహెచ్‌ఎంలు విష్ణువర్ధన్‌రెడ్డి, కొండాపురం బాలరాజు, కృష్ణవేణి పాల్గొన్నారు.



అమరచింతలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

'ఒక్కరోజు సమ్మె' నోటీసు అందజేత

పెబ్బేరు రూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ఈ నెల 8న ఒక్కరోజు సఫాయి బంద్ చేపడతామని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో డీపీఓ రమణమూర్తికి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 12,769 పంచాయతీల పరిధి 52 వేల మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారని, మల్టీ పర్పస్ వర్కర్ పేరుతో తీసుకొచ్చిన విధానం వల్ల నైపుణ్యం లేని పనులు చేయటం వలన విద్యుత్ సంభాలు ఎక్కిన కార్మికులు, ట్రాక్టర్ నడిపిన కార్మికులు అనేక మంది చనిపోయారని వాపోయారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులను విస్మరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో మల్టీ పర్పస్‌వర్కర్ విధానం పూర్తిగా రద్దు చేయాలని, పంచాయతీ ఉద్యోగులకు మున్సిపల్ ఉద్యోగుల వలె జీఓ నంబరు 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. గురువారం ఉదయం మర్రికుంటకు చేరుకొని సమ్మె విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రాములు తదితరులు పాల్గొన్నారు.



డీపీఓ రమణమూర్తికి సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

చేనేత కార్మికులను ఆదుకోవాలి

అమరచింత: చేనేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగించి, వారిని ఆదుకోవాలని అమరచింత చేనేత సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమోహన్, క్యామ శ్రీను కోరారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో చేనేత కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేనేత కార్మికులకు సత్కరించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ చేనేత త్రిఫ్ట్ ఫండ్, చేనేత మిత్ర, చేనేత బీమా, చేనేత రుణమాఫీని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని కోరారు.

కలెక్టర్ చేతుల మీదుగా..

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అమరచింత పట్టణానికి చెందిన సీనియర్ చేనేత కార్మికులు దేవరకొండ లచ్చన్న, పారుపల్లి చింతన్నను కలెక్టర్ ఆదర్శ్‌సురభి, అడిషనల్ కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ సన్మానించారు. వయోభారం ఉన్నా నేటికీ మగ్గంపై జరీ చీరలను తయారు చేస్తున్న నేత కార్మికులను అభినందించారు.



చేనేత కార్మికులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో..

చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్వని రాధ ఆధ్వర్యంలో చేనేత మహిళా కార్మికులను ఘనంగా సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం చేనేత రంగానికి ప్రాధాన్యత కల్పించి ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో జ్యోతి రమణ, పుష్పలత, అవుల కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో గర్భిణికి ప్రసవం



వీపనగండ్ల: గర్భిణి వైద్య పరీక్షల కోసం ఆటోలో ఆస్పత్రి వెళ్తుండగా.. నొప్పులు అధికమై ఆటోలోనే ప్రసవం జరిగిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నంబావి మండంలోని కొప్పునూరు గ్రామానికి చెందిన గర్భిణి అనూష వైద్య పరీక్షల కోసం వీపనగండ్ల ప్రభుత్వాస్పత్రికి ఆటోలో వస్తున్నారు. మండలంలోని అమ్మాయిపల్లి సమీపంలోకి రాగానే ఆమె పురిటి నొప్పులు అధికమై ఆటోలోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యుడు రాజశేఖర్ మాట్లాడుతూ తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు.

బ్యాంకుల్లో రైతులకు తప్పని పడిగాపులు

పాన్‌గల్: బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు, రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు పడిగాపులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ, ప్రాథమిక సహకార బ్యాంకుల్లో వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద మొత్తంలో చేరుకున్నారు. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి 20 రోజులు గడుస్తున్నా నేటికీ మొదటి విడతలో మాఫీ అయిన రైతులకు రుణాలు అందని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ అయిన రైతులు వారికి సంబంధించిన ధ్రువపత్రాలు ఇచ్చిన పది రోజుల తర్వాతనే రుణాలు అందిస్తామని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. పది రోజుల తర్వాత బ్యాంకులకు వెళితే రైతులు ఇచ్చిన ధ్రువపత్రాలు కనిపించడం లేదని, మరోమారు ధృవపత్రాలు ఇవ్వాలని అధికారులు చెబుతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రుణాలు తీసుకోవడం మరింత జాప్యం జరుగుతుందన్నారు. ప్రాథమిక సహకార సంఘం బ్యాంకులో మాత్రం ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీ నుంచి ఇప్పటి వరకు వడ్డీ చెల్లించాలని, ఈసీ తీసుకురావాలనే నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇబ్బందులు తొలగించి రుణాలు త్వరగా అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



పాన్‌గల్ ఎస్‌బీఐ బ్యాంకులో రైతులు

నాయీబ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడిగా చిన్నయ్య

వనపర్తి: వనపర్తి పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడిగా చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా గోవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నూతన అధ్యక్ష, కార్యదర్శులకు రాంనగర్ కాలనీలోని రామాలయంలో ఆ సంఘం నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పట్టణ నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని క్యాంపు కార్యాలయంలో, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని ఆయన నివాసంలో, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణను పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సదుర్ల రమేష్, మణిగిల్ల సత్యం, కోకిల వెంకటేశ్, ఆంజనేయులు, రామస్వామి, సాయిబాబా, సంపత్, నాగరాజు, సురేష్, భాస్కర్ తదితరులు ఉన్నారు.



అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

బీసీ హాస్టల్‌లో వార్డెన్‌ను నియమించండి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతిగృహంలో వార్డెన్‌ను నియమించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఇక్కడ డిప్యుటేషన్‌పై వార్డెన్‌గా పనిచేసిన శివయ్యను ఇతర ప్రాంతానికి బదిలీ చేశారు. దీంతో మరొకరిని వార్డెన్‌గా నియమించకపోవడంతో రాత్రివేళల్లో విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు సమకూర్చడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ముగిసిన రైతుబీమా దరఖాస్తుల గడువు

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా చేసుకునేందుకు ప్రభుత్వం విధించిన గడువు బుధవారంతో ముగిసింది. చివరి రోజు మండల కేంద్రంలోని రైతువేదికతో పాటు వివిధ క్లస్టర్ల పరిధిలో ఉన్న రైతు వేదికల్లో దరఖాస్తులు అందజేసేందుకు రైతులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. దరఖాస్తుల గడువు ఈనెల 5వ తేదీ వరకు ఉన్నా.. రెండు రోజులు పొడగించడంతో ధరఖాస్తులు చేసుకునేందుకు చాలా మందికి అవకాశం లభించిందని రైతులు తెలిపారు. మండలంలో 942 నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు ఉండగా.. వారిలో 85 శాతం రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు ఏఓ సాజిద్‌రహమాన్ పేర్కొన్నారు.



పాన్‌గల్‌లో దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

సైబర్ నేరాలపై అప్రమత్తం

గోపాల్‌పేట: విద్యార్థులు, యువత సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని, పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని రేవల్లి ఎస్‌ఐ రాము అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లలో వచ్చే ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎట్టిపరిస్థితుల్లో ఇతరులకు చెప్పొద్దని సూచించారు. పద్దెనిమిదేళ్లు నిండిన తర్వాతే అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో సీపీఎం నాయకుడు వెంకటయ్య మాతృమూర్తి శాంతమ్మ బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, రైతు సంఘం జిల్లా నాయకులు బాల్‌రెడ్డి, భగత్ మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బాలస్వామి, కృష్ణయ్య, నిరంజన్, భాస్కర్, మల్లేష్, ఎండీ ఖాజా, బాలకృష్ణ, బాలకిష్టయ్య పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్లకు చెందిన వెంకటేష్ జూన్ 21వ తేదీన ఆత్మకూర్‌కు బైక్‌పై వస్తుండగా సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని కనుక్కొని రికవరీ చేసి అప్పగించినట్లు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌గా ఎమ్మెల్యే మేఘారెడ్డి

- పట్టణంలో 10 కిలోమీటర్లు బస్సు నడిపిన ఎమ్మెల్యే



వనపర్తిటౌన్: ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆర్టీసీ డ్రైవర్‌గా మారారు. వనపర్తి జిల్లా కేంద్రంలో బుధవారం ఆర్టీసీ డిపోలో షెటిల్ బస్సును ప్రారంభించి డ్రైవింగ్ చేశారు. పట్టణంలోని ముఖ్య కూడళ్ల మీదుగా బస్టాప్‌లో ప్రయాణికులను ఎక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రయాణికులతో పాటు ఆయన కూడా టికెట్ తీసుకున్నారు. వనపర్తి నియోజవకర్గంలో ప్రతి పల్లెకు ఆర్టీసీ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

తిరుపతి దేవస్థానంలో తిప్పడంపల్లి భజన మండలి ప్రదర్శన

ఆత్మకూర్: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో తిప్పడంపల్లి గ్రామ భజనమండలి సభ్యులు బుధవారం భజన కార్యక్రమం చేపట్టారు. గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి భజనమండలి సభ్యుల బృందం 20 ఏళ్లుగా తిరుపతి దేవస్థానంలో భజనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమకు ఈ అవకాశం కల్పిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భజన మండలిసభ్యులు మాకం కృష్ణ, బాల్‌రాజు, పరమేష్, శాంతన్న, తిరుపతయ్య, సిద్దయ్య, నాగరాజు, లింగన్న, చంద్రాయుడు ఉన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ఆత్మకూర్: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం అత్మకూర్ మున్సిపాలిటీలోని మూడో వార్డులో, మండలంలోని గ్రామాల్లో తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి వేర్వేరుగా పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు.

అమరచింత: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం గడుపుతారని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, స్పెషల్ ఆఫీసర్ మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్ప అన్నారు. స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంతో పాటు ఉర్దూ మీడియం సమీపంలో, ప్రార్థన మందిరాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిల్వ నీరు, పిచ్చిమొక్కలను తొలగించారు. వర్షం కారణంగా రహదారులపై నిలిచిన నీటి గుంతల్లో మొరం మట్టి వేసి నీరు నిల్వ కుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని కొత్తపల్లిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్ పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, పంచాయతీ సెక్రెటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలో గుర్తించిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

వనపర్తిటౌన్: ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను, సర్వేలో గుర్తించిన పిల్లలను భవిత కేంద్రాలకు తరలించాలని, వీరిని రెండేళ్లలో సాధారణ పాఠశాలల్లో చేర్పించేలా శ్రద్ధ చూపాలని జిల్లా సమన్వయకర్త యుగంధర్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని వనరుల కేంద్రం (ఎంఆర్సీ)లో జిల్లా స్థాయి విలీన విద్యా ఉపాధ్యాయ (ఐఈఆర్పీ) సమావేశం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, బాలికలకు స్టైఫండ్‌ను ప్రభుత్వం ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ప్రతి వారం ఇంటివద్ద విద్య, ఫిజియోథెరపి, స్పీచ్ థెరపీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భవిత కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు మానిటరింగ్ చేస్తారన్నారు. ఈనెల 20వ తేదీన జరగబోయే ఉచిత ఉపకరణాల నిర్ధారణ పరీక్షల శిబిరానికి ఉపకరణాలు అవసరమైన విద్యార్థులను గుర్తించి, సంబంధిత ధృవీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు జయరాములు, జయశంకర్, ఐఈఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్రమశిక్షణలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

ఖిల్లాఘనపురం: విద్యార్థులు క్రమశిక్షణతో ఉండటంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని మామిడిమాడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చెన్నప్ప అన్నారు. బుధవారం సల్కెలాపురంలో మామిడిమాడ పాఠశాలకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు వెళ్తున్నాడని, వారిని వదిలేస్తే భవిష్యత్‌తో సమస్యలు వస్తాయన్నారు. వారిని నిరంతరం గమినిస్తూ ఉండాలని సూచించారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా పుస్తక పఠనం చేయించాలని కోరారు.

ఎమ్మెల్యే హామీ ఏమైంది?

పెబ్బేరు రూరల్: మున్సిపాలిటీలో వివాదంలో ఉన్న సంత స్థలంపై ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం పెబ్బేరు పట్టణ కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ సంత స్థలం కాపాడేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో వనం రాములు, ఎల్లయ్య, రాజశేఖర్, ఎల్లారెడ్డి, పెద్దింటి వెంకటేష్ ఉన్నారు.